# జానకమ్మ మెుగుడు

"ఇంట్లో ఒక్క నీటిచుక్క లేదు. నేనే ముందు పట్టుకుంటా."
దివి నుండి అప్పుడే భువికి దిగివచ్చిన గంధర్వ కన్యలా హొయలు
ఒలకబోస్తూ బిందెను కుళాయి ముంపున జరిపిందో జవరాలు.

"అదెలా? నేను ముందొచ్చాను, ముందు నేనే పట్టుకుంటా." ఆవిడ
బిందెను జబర్దస్తీగా వెనక్కు నెట్టిందో చిత్రాంగి-

"నేను మడిగట్టుకొచ్చి గంటసేపైంది. నీళ్ళు లేక పూజ ఆగి
పోయింది. ముందు నన్నో చెంబెడు నీళ్ళు పట్టుకోనీయండమ్మా!"

రాని నవ్వు శాస్త్రిగారి పెదాలమీద బలవంతంగా గంతులేసింది.

"అదేంకుదర్దు. అందరికంటే వెనకొచ్చి ముందు పడతానంటే....
ఇదేమన్నా సినిమా టిక్కెట్టా?" చిత్రాంగి ముక్కుపుటా లెగిరిపడినై.

"అయ్యో, అయ్యో! పాపం, పుణ్యం ఏదీలేదా? పూజకు నీళ్ళ
పట్టనివ్వకుంటే పురుగులుబడి చస్తారు. మళ్ళీ జన్మలో ఎనుబోతై పుడ
తారు...." శాస్త్రిగారి అర్ధాంగి అన్నపూర్ణమ్మ దండకమందుకుంది.

"....ఏయ్, మాటలు కాస్త జాగ్రత్తగా రానీ!"

"చిన్నంతరం పెద్దంతరం లేకుండా మాట్లాడ్తే చెవుల గూబలు
పగుల్తాయ్...జాగ్రత్త!"బుగ్గనున్న తాంబూలంతాలూకు రసబిందువులు....
మూడ్రోజులకోసారి ముచ్చటగా పలుకరించే మున్సిపల్ కుళాయి చుట్టూ
పడిగాపులు గాస్తున్న మహిళల చీరెలమీద పడ్తున్నై. రాబోవు తుపాన్ని
ముందే పసిగట్టిన శాస్త్రజ్ఞుడిలా.... చల్లగా జారుకున్నారు శాస్త్రిగారు.

"అవ్వ! ఇదేమిటీ ఎంగిలీ?" కోపంతో బిందె లేపిందొక రుద్రమదేవి.

"శుభమాని కొత్త గుడ్డలేసుకుని కుళాయి దగ్గరికొస్తే....వాటి మీద ఉమ్మేస్తావే పాపపుదానా?" పళ్ళు నూరిందో ఝాన్సీరాణి.

నలుగురూ నాలుగు రకాలుగా తిడుతూంటే అన్నపూర్ణమ్మ పరువు గోదావరిలో కొట్టుకుపోయింది.

బుర్రలో భూగోళం బద్దలైంది. తన వర్గానికి కనుసైగజేసి -

"మీ పిండాకూడు!" ఇంకేదో అనబోయేలోగా చిత్రాంగి బిందె ఆవిడ వీపుమీద ఢామ్మంది. చిత్రాంగి సిగ అన్నపూర్ణమ్మ చేతికొచ్చింది.

అన్నపూర్ణమ్మ సిగ రుద్రమ చేతిలో.రుద్రమ్మసిగ భద్రకాళిచేతుల్లో.... నీళ్ళరాని కుళాయి ముందు మహిళలు రెండు పార్టీలుగా విడిపోయారు.

బిందెలే ఆయుధాలుగా.... జడలూ, సిగలూ టార్గెట్స్‌గా ప్రచ్ఛన్నయుద్ధం చెలరేగింది.

మతకల్లోలాలు రేపి మారుమూల నుండి తమాషా చూస్తూన్న నాయకుడిలా, కుళాయికి వంద గజాల దూరంలో నిల్చున్న అమ్మణ్ణి.

"అదిగో.... జానకమ్మ మొగుడు! అతణ్ణి పోలీసులు పట్టుకెళ్తున్నారు!" అరిచినంత పంజేసింది.

రెఫరీ ఈల వేయగానే ఆగిపోయిన కుస్తీ పోటీలా సిగపట్ల ఫీట్లకు స్వస్తి పలికి అటువైపే చూస్తున్నారంతా.

ఔను? చినిగిన గుడ్డలూ.... మాసిన గెడ్డం.... బతుకు భారాన్ని చూడలేక లోతుకుపోయిన కళ్ళూ.... అతడు నరహరే.... జానకమ్మ మొగుడు! అత్తారింటికి మొదటిసారి వెళ్తున్న కొత్తల్లుడిలా ఇద్దరు కానిస్టేబుళ్ళమధ్య దర్జాగా నడుస్తున్నాడు.

"ఏ ఇల్లూ దొరకనట్టూ ఆ ఇంట్లోనే ఎందుకు దొంగతనం చేశావురా హరీ?" కుడి కానిస్టేబుల్ చేతికర్ర గాల్లోకి లేచింది.

"ఏయ్ పోలీసన్నా! మాటలు కాస్త జాగ్రత్తగా రానీ! రా, గీ అంటే మర్యాదగుండదు." వార్నింగిచ్చాడు నరహరి.

"హరిహరీ! నేరస్థుడి గ్గూడా మర్యాదనా?" ఎడమ కానిస్టేబుల్ లాఠీ లేపబోయి విరమించుకుంది.

"అద్సరే.... అర్థబలం, అంగబలం అన్నీ ఉన్న వాళ్ళింట్లోనే దొంగతనమెందుకు చేశారు నరహరిగారూ?" కవ్వించాలనుకున్నాడు కుడి కానిస్టేబుల్.

"నీరు పల్లమెరుగు, నిజము దేవుడెరుగునన్నట్టు ఉన్నోడింట్లోంచి లేనోడు పట్టుకెళ్తాడు. ఇన్నాళ్ళ పోలీసు ఉద్యోగం ఈ మాత్రం నేర్వ లేదా?" కనుబొమలెగరేసి ఠీవిగా గెడ్డం పుణుక్కున్నాడు నరహరి.

తగలాల్సిన చోటే తగిలింది కానిస్టేబుళ్ళకు.

"జానకమ్మ మొగుడంటే ఏమో అనుకున్నా!" బుగ్గలు నొక్కు కుంది అన్నపూర్ణమ్మ.

"గడుసుపిండమే....!" చిత్రాంగి నోరుదెరిచింది.

ఇంత జరుగుతున్నా.... దుఃఖంలేని కళ్ళలా మున్సిపల్ కుళాయి మిర్రి మిర్రిగా చూస్తూందే కాని, చుక్కనీరు రాల్చడంలేదు.

o o o

నిండు కోర్టు.

"దొంగతనంచేశావా?" అడిగాడు జడ్జి నరహరిని.

నరహరి పచ్చిదొంగ అని గొంతు చించుకున్న పబ్లిక్ ప్రాసి క్యూటర్ ఆయాసమొచ్చి కూచున్నాడు.

జడ్జి వెనక పై భాగంలో బోసినవ్వు లొలకబోస్తున్న బాపూజీ మీదున్నాయి.... నరహరి చూపులు.

....నవ్వుతున్నావా మహాత్మా? రామరాజ్యం రావాలని కలలు గన్నావు గదూ? నీ కలల రాజ్యంలో వేలకోట్ల రూపాయలు దిగమింగి పెద్ద పెద్ద ప్రాజెక్టులు వెలిశాయి.

ఓ పక్క అతివృష్టి, మరో ప్రక్క అనావృష్టి. మాకేమో గొంతు తడుపుకునేందుకు మంచినీరు కాదుగదా, ఉప్పునీరు గూడా గతిలేదు. రెక్కాడితేగాని డొక్కాడని నాలాంటివాడింతకంటే ఇంకేంజేస్తాడను కున్నావ్?

పశువులు నీళ్ళులేక అల్లాడి పోతున్నై. పొలాలు నోరుదెరుచు క్కూచున్నై, పక్షులు వలసబోతున్నై. ఊరి బావుల్లోని నీటిని సూర్యుడు తాగేశాడు. ఎవరి పర్మిషన్తో సూర్యుడంత ధైర్యం చేశాడు?

మున్సిపల్ నల్లా మూన్నాల్గురోజులకోసారి ముప్పై నిమిషాలు మూతులు దిప్పిపోతుంది. డబ్బున్న మారాజులు బోరింగులు వేయించు కున్నారు. మా ఇంటిపక్క దేవీలాల్ సేటు గూడా వేయించుకున్నాడు. నరహరి హృదయం ఘోషిస్తోంది.

"చెప్పవేమయ్యా! దేవీలాల్ సేటింట్లో దొంగతనం చేశావా?" మళ్ళీ అడిగాడు జడ్జి.

"చేశానండి!"

"ఎందుకు చేశావ్?"

"మూడ్రోజుల క్రితం కుళాయి దగ్గర నీటిబొట్టు దొరకలేదు. చెమటోడ్చి సంపాదించిన కూలీ డబ్బుల్లోంచి ఐదు రూపాయలు పెట్టి బిందెడు నీళ్ళు కొనుక్కున్నా. నిన్నరాత్రి మా కుర్రోడు.... వాడేసండీ.... మూడేళ్ళ బడుద్దాయ్- నీళ్ళు కావాలని మంకుపట్టు బట్టిండు. ప్చ్.... నీళ్ళ

దొరకలేదు. వీపుమీద నాలుగంటించాను. కన్నీళ్ళు చప్పరించి చప్పున పడుకున్నాడు. ఇది ఎండాకాలం గదండీ!.... నాకూ నా ఇంటిదాని కూ్కడా నాలికలు పిడచగట్టుకు పోయినై. నీళ్ళకోసం అల్లాడుతున్నాం. మేం నిద్రబోకముందే మా బిడ్డాయి నిద్రలేచి ఏడుపు లంకించుకున్నాడండి! కన్నకడుపు మా చెడ్డదండి.... మా గుండెలు నీరైపోయినై. అప్పుడండీ.... దేవీలాల్ సేటుగారి ప్రహరీగోడ దూకేశానండి! భారమంతా భగవంతుని మీద పడేసి వాళ్ళ బోరింగుకు ఓ బిందెడు నీళ్ళు కొట్టుకుని గోడమీంచి మా ఇంటిదాని కందించానండి. అంతే.... నా కర్మ కాలింది, పట్టుబడిపోయాను...."

''లాయర్ను పెట్టుకుంటావా?"

"దానికి డబ్బులు కావాలి గదండీ? అవే నా దగ్గరుంటే మరో బిందెడు నీళ్ళు కొనుక్కునేవాణ్ణి....'

"బెయిల్ దరఖాస్తు పెడతావా?"

"వద్దండీ! బెయిలూ, గియిలూ నేనడగనండి! నాతోబాటు నా భార్యనూ, కొడుకునుగూడా జైలుకు పంపించండి సార్!.... మీకు పుణ్యముంటుంది సార్!.... అక్కడైతే నీళ్ళ వసతుంటుంది సార్!...." రెండు చేతులెత్తి నమస్కరించాడు.

(అమృత్ కిరణ్ 16-1-1995)